మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 17-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 18 Issue: 18

17 జూలై 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:54 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి తదియ ఉ. 6:28 వరకు తరువాత చవితి తె. 4:420 వరకు సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం మఖ సా. 6:36 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వ్యతీపాత రా. 10:44 వరకు కరణం గరజ ఉ. 6:28 వరకు వనిజ సా. 5:36 వరకు వర్జ్యం ఉ. 7:13 నుండి ఉ. 8:44 వరకు దుర్ముహూర్తం ఉ. 8:29 నుండి ఉ. 9:21 వరకు మ. 12:48 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 10:45 నుండి మ. 12:22 వరకు యమగండం మ. 3:36 నుండి సా. 5:13 వరకు గుళికాకాలం ఉ. 7:31 నుండి ఉ. 9:08 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:18 నుండి తె. 5:06 వరకు అమృత ఘడియలు సా. 4:18 నుండి సా. 5:49 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## తల్లికి తొలి బోనం అందింది!

### గోల్కొండ కోటలో సమర్పణ.. బోనమెత్తిన కొండా సురేఖ.. భాగ్యనగరానికి పూనకాలు

ఆషాఢ బోనాల మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో హైదరాబాద్ నగరం భక్తిరసంలో మునిగిపోయింది. తొలి రోజే వరుణుడు కూడా కరుణించడంతో భక్తులు మరింత ఆనందోత్సాహాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. గోల్కొండ కోటలో ప్రారంభమైన బోనాల వేడుకలతో హైదరాబాద్ అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): లంగర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్.. మంత్రి కొండా సురేఖకు సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తడం విశేషంగా నిలిచింది. శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వ పక్షాన మంత్రులు అధికారికంగా పట్టువస్త్రాలు, మొదటి 'బంగారు బోనం' సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం తరువాయి 2 వ పేజీలో...




## నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్ ఫలితాలు విడుదల

### 11.21 లక్షల మంది అర్హత

### ఇద్దరు విద్యార్థులకు 720కి 715 మార్కులు

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) గురువారం ప్రకటించింది. ఈ పరీక్షలో మొత్తం 11.21 లక్షల మంది విద్యార్థులు మెడికల్ అడ్మిషన్లకు అర్హత సాధించారు. మే 3న జరిగిన అసలు పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

న్యూఢిల్లీ: ఈ ఫలితాల్లో పంజాబ్‌కు చెందిన ఆర్యన్ గుప్తా, హర్యానాకు చెందిన పాన్షుల్ బన్సల్ ఇద్దరూ 720కి 715 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అర్హత సాధించిన వారిలో 58 శాతానికి పైగా మహిళా అభ్యర్థులే ఉన్నారని ఎన్టీఏ తెలిపింది. టాపర్లలో అత్యధికులు 17 నుంచి 19 ఏళ్ల వయసు వారే ఉన్నారు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తమిళనాడుతో పాటు తెలంగాణ నుంచి కూడా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఫలితాలను సకాలంలో ప్రకటించడం వల్ల మెడికల్ అడ్మిషన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సజావుగా కొనసాగించడానికి వీలవుతుందని ఎన్టీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యార్థుల సౌలభ్యం కోసం స్కాన్ చేసిన ఓఎంఆర్ షీట్లు, స్కోర్‌కార్డులను డిజిలాకర్‌లో కూడా అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది.



## కరోనాతో నలుగురు మృతి

### ఏపీలో మళ్లీ కోవిడ్ కలకలం

### 20 రోజుల్లో 12 పాజిటివ్ కేసులు

### వైద్యారోగ్యశాఖ అప్రమత్తం

విశాఖపట్నం/కాకినాడ, జూలై 16 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు రాష్ట్రంలో మొత్తం 12 కరోనా - 2 వ పేజీలో...




## నిరుద్యోగులపై లాఠీల ముద్దు!

### దిల్‌సుఖ్‌నగర్‌లో మహాధర్నా ఉద్రిక్తం.. నిరసనకారులపై పోలీసుల లాఠీ చార్జీ

### అనుమతి తీసుకున్నా అరెస్టు చేస్తున్నారు.. తీవ్రంగా మండిపడ్డ నిరుద్యోగులు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 19 వేల పోలీస్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ '5 వేలు వద్దు-19 వేలు ముద్దు' అనే నినాదంతో దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగ యువత గురువారం భారీ మహాధర్నా నిర్వహించింది. ఈ మహా ధర్నాలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చిన నిరుద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లపై గళమెత్తారు.

దిల్‌సుఖ్‌నగర్-హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): పోస్టులు పెంచి 20 వేల పోలీస్ ఉద్యోగాలతో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరిన నిరుద్యోగులపైన పోలీసులు లాఠీచార్జీ చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. నిరసన చేస్తున్నవారిని అరెస్ట్ తరువాయి 2 వ పేజీలో...



## 9వ తరగతిలో మూడో భాష వద్దు

### సుప్రీంకోర్టు


2



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,3౦29 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,151 |



## భారత్‌లో 'ఇంజినీరింగ్ బయాలజీ' కోర్సు

న్యూఢిల్లీ: భారత్‌లో త్వరలో 'ఇంజినీరింగ్ బయాలజీ' గ్రాడ్యుయేషన్ కోర్సు తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. దేశంలో శాస్త్రీయ, ఆరోగ్య సంరక్షణ విభాగాల్లో స్వతంత్ర వ్యవస్థను నిర్మించుకోవడంలో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్‌లో ఈ తరహా కోర్సు తీసుకురావడం ఇదే తొలిసారి అని కేంద్ర మంత్రి వెల్లడించారు. 2035 నాటికి భారత్‌ను బయో ఎకానమీలో ప్రబల శక్తిగా నిర్మించేందుకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.. డిజిటల్ విప్లవాన్ని కంప్యూటర్ సైన్స్ తరువాయి 2 వ పేజీలో...

## పాలాభిషేకాలు వద్దు!

### జేసీబీ గజమాలలు బంద్.. తెలంగాణ కాంగ్రెస్ ఆదేశాలు



హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లకు పాలభిషేకాలు, జలాభిషేకాలు చేయడాన్ని పూర్తిగా నిషేధించింది. అలాగే, జేసీబీలు, బుల్డోజర్లు వంటి భారీ యంత్రాల సహాయంతో నాయకులకు గజమాలలు వేయడాన్ని నిలిపివేస్తూ గురువారం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధమైన ఇటువంటి పద్ధతులకు స్వస్తి పలకాలని స్పష్టం చేసింది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు టీ కుమార్‌రావు ఈ సర్క్యులర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. (దేశంలో ఎందరో పోషకాహార తరువాయి 2 వ పేజీలో...



## కరెంట్ ఉంటే వార్త..

### ఇదే కాంగ్రెస్ సర్కారు ఘనత!..

### 11 జిల్లాల్లో రైతుల ధర్నాలు.. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సమస్యలు

### రిజర్వాయర్లలో 33 శాతమే నీరు.. ప్రభుత్వంపై హరీశ్ ఫైర్

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ తరువాయి 2 వ పేజీలో...



## 'ఎఫ్-1' విద్యార్థులకు నాలుగేండ్ల గడువు!

2

## విశ్వవాణి



చదువుతున్నప్పుడు లేదా పనిచేస్తున్నప్పుడు ఏకాగ్రత పెంచేందుకు చాలామంది బైనౌరల్ బీట్స్ పేరుతో ప్రత్యేక ఆడియోలను వింటుంటారు. ఇవి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయని, దృష్టి కేంద్రీకరణను పెంచుతాయని ప్రచారం ఉన్నప్పటికీ, తాజా పరిశోధనలు మాత్రం వాటి ప్రభావం పరిమితంగానే ఉందని సూచిస్తున్నాయి. బైనౌరల్ బీట్స్ అనేవి రెండు చెవుల్లో స్వల్పంగా భిన్నమైన ఫ్రీక్వెన్సీ కలిగిన శబ్దాలను వినిపించినప్పుడు, మెదడు వాటిని కలిపి మరో మూడో శబ్దం (బీట్) వినిపిస్తున్నట్లుగా భావించే శ్రవణ భ్రమ. ఈ ప్రక్రియ మెదడులోని న్యూరాన్‌ల కార్యకలాపాలను ప్రభావితం చేసి విశ్రాంతి, అప్రమత్తత లేదా ఏకాగ్రత వంటి స్థితులకు అనుకూలంగా మార్చవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.




## 500 మంది రోహింగ్యాలు జల సమాధి

విశాఖపట్నం, జూలై 16 (ఈవార్తలు): బంగాళాఖాతంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మయన్మార్ కోస్తా తీరానికి ఆవల బంగాళాఖాతంలో రెండు పడవలు బోల్తాపడిన ప్రమాదంలో 500 మంది రోహింగ్యా శరణార్థులు మరణించారు. బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి రెండు పడవుల్లో జూన్‌లో 530 మంది శరణార్థులు బయలుదేరగా, జూలై 8న జరిగిన ప్రమాదాల్లో 500 మంది మరణించారు. ఐక్యరాజ్యసమితి వర్గాలు తెలిపిన తరువాయి 2 వ పేజీలో...



## ఈహెచ్ఎస్ అమలుపై జీవో జారీ

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుపై రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈహెచ్ఎస్ అమలును ఎంప్లాయిస్ హెల్త్‌కేర్ ట్రస్టుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం నిధులను ఉద్యోగులు, పెన్షనర్ల వైద్యసేవలకే వినియోగించాలని తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

17.7.2026

మేషం: ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకుంటాయి, పై అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. చేపట్టిన ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి, నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు.

వృషభం: ఆర్థిక పరిస్థితి చాలా మెరుగ్గా ఉంటుంది, నూతన వస్తువులు లేదా గృహోపకరణాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించడం మంచిది. తోబుట్టువుల నుండి ఆశించిన మద్దతు లభిస్తుంది.

మిధునం: పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టుదలతో పనులను సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారంలో భాగస్వాములతో మాట్లాడేటప్పుడు తొందరపాటు పనికిరాదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది, దైవదర్శనాలు చేసుకుంటారు.

కర్కాటకం: సమాజంలో మీ గౌరవ మర్యాదలు పెరుగుతాయి, అనుకోని విధంగా ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. మిత్రులతో కలిసి విందు వినోదాలలో పాల్గొంటారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న పనులు సజావుగా సాగుతాయి.

సింహం: సమాజంలో నూతన పరిచయాలు ఏర్పడతాయి, ఇవి భవిష్యత్తులో మీ వ్యాపార అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. కోపాన్ని నియంత్రించుకోవడం వల్ల బంధాలు దెబ్బతినకుండా ఉంటాయి.

కన్య: వృత్తి ఉద్యోగాల్లో బదిలీలు లేదా పదోన్నతల సూచనలు కనిపిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు చాలా వరకు తొలగిపోయి ఆదాయం నిలకడగా ఉంటుంది. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది, ఆరోగ్యం సహకరిస్తుంది.

తుల: చేపట్టిన పనులు కొంత నెమ్మదిగా సాగుతాయి, కాబట్టి ఓర్పుతో వ్యవహరించడం అవసరం. అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. ముఖ్యమైన విషయాల్లో కుటుంబ పెద్దల సలహాలు తీసుకోవడం వల్ల మేలు జరుగుతుంది.

వృశ్చికం: మీరు పడిన శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. పాత మిత్రులను అనుకోకుండా కలుసుకోవడం వల్ల మనస్సుకు ఎంతో ఆనందం కలుగుతుంది. ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది, నూతన పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన రోజు.

ధనస్సు: వృత్తి, వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి, ఆకస్మిక లాభాలు ఉంటాయి. బంధువుల నుండి ఒక శుభవార్త వింటారు. ఇంట్లో సంతోషకరమైన, ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంటుంది, ప్రయాణాలు కలిసివస్తాయి.

మకరం: అనవసర వివాదాలకు, ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం మంచిది. కార్యాలయంలో సహోద్యోగులతో చిన్నపాటి విభేదాలు వచ్చే సూచనలున్నాయి. ఖర్చుల విషయంలో బడ్జెట్ ప్రకారం నడుచుకోవడం ఎంతైనా అవసరం.

కుంభం: వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. దీర్ఘకాలిక ఋణ భారం పెరుగుతుంది. ఇంటా బయటా ఊహించని సమస్యలు కలుగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అంతగా అనుకూలించవు. సంతాన అనారోగ్యం విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. సోదరులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

మీనం: ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు కలుగుతాయి. ఆప్తులతో శుభాకార్యాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. విద్యార్థులు పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభలు అందుకుంటారు. దైవ చింతన పెరుగుతుంది.



# తల్లికి తొలి బోనం అందింది!

**మొదటి పేజీ తరువాయి**

రూ. 11 లక్షల రూపాయల ప్రభుత్వ చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల వీర విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో లంగర్ హౌస్ పరిసర ప్రాంతాలన్నీ భక్తి పారవశ్యంతో ఊగిపోయాయి. ఈ వేడుకను కళ్లారా చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆషాఢ బోనాల జాతరకు గోల్కొండ కోట తొలి వేదిక కావడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నగర నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎక్కడికక్కడ భారీ బందోబస్తును మోహరించారు.

**నగరానికి పూనకాలు**

పోతురాజుల వీరనృత్యాలు, శివసత్తుల పూనకాలు, ఘటాల ఊరేగింపులు, డప్పుల మోతల మధ్య నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముత్యాలమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ వంటి గ్రామదేవతలకు మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం.. పాతబస్తీ లాల్‌దర్వాజా అమ్మవారి ఆలయంతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని సుమారు 3 వేల ఆలయాల్లో బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పండుగను వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు కేటాయించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో సేవలు అందిస్తున్నాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య శిబిరాలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల కోసం పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలియజేశారు. బోనాలు తెలంగాణ ఆత్మగౌరవానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రకృతి అనుగ్రహం, ప్రజల సౌభాగ్యం, పంటల సమృద్ధి కోసం అమ్మవారిని వేడుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల సంస్కృతిని ప్రతిబింబించే విశిష్ట ఉత్సవంగా కొనసాగుతోంది.

# కరెంట్ ఉంటే వార్త..

**మొదటి పేజీ తరువాయి**




ప్రభుత్వానికి కనీస ముందుచూపు లేకపోవడం వల్లే రాష్ట్రం అంధకారంలోకి వెళ్తోందని మండిపడ్డారు. "ఒకప్పుడు కరెంట్ పోతే వార్త.. కానీ ఈ చేతకాని ప్రభుత్వ పాలనలో ఇప్పుడు కరెంట్ ఉంటేనే వార్తగా మారింది" అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడంతో ఇప్పటికే 11 జిల్లాల్లో భారీ ఎత్తున ధర్నాలు జరిగాయని, చాలా చోట్ల రైతులు ఆగ్రహంతో సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్నారని గుర్తుచేశారు. అప్రకటిత కరెంట్ కోతలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కనీసం 6 నుంచి 7 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు కూడా లేకపోవడం వల్లే ఈ తీవ్రమైన విద్యుత్ సమస్య తలెత్తిందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, కనీస నిర్వహణ లోపం వల్ల బొగ్గు నిల్వలు లేక విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా కుంటుపడిందని స్పష్టం చేశారు. "ఈ ప్రభుత్వంలో బొగ్గు లో స్కాం, పవర్ లో స్కాం, సాండ్ (ఇసుక) లో స్కామ్‌లు విచ్చలవిడిగా బయటపడుతున్నాయి" అని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో కేవలం 33 శాతం మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంగా తాము నిరంతరం ప్రభుత్వాన్ని నిద్రలేపుతున్నా, పాలకుల్లో కనీస ఉలుకూ పలుకూ లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సరిపడా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉందని హరీశ్ రావు గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలో 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఈ ప్రభుత్వ చేతకానితనం వల్ల కేవలం 3,190 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నడిపే వారికి కనీస అవగాహన, సోయి లేదని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇంధన శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కనీస బాధ్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు కనీసం 8 గంటల విద్యుత్‌ను కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు.

# నిరుద్యోగులపై లాఠీల ముద్దు!

**మొదటి పేజీ తరువాయి**

చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయితే, అనుమతి తీసుకొని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా పోలీసులు తమను అరెస్ట్ చేస్తున్నారని నిరుద్యోగులు మండిపడ్డారు. ఈ ఘటనను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని, ఉద్యమాలను అణచివేసే చర్యలను విరమించి, నిరుద్యోగ యువత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నాగోల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరెస్టైన నిరుద్యోగ యువతకు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 19 వేల పోలీస్ పోస్టులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను పారదర్శకంగా, వేగవంతంగా భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని సుధీర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగుల జేఏసీ నాయకులు ఇంద్రా నాయక్, ఆకాష్, శంకర్, శింబు కుమార్ నాయక్, సింధూ రెడ్డి, రమేష్, చెర్రీ, ప్రవీణ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో 'ఇంజినీరింగ్ బయాలజీ' కోర్సు

నడిపించినట్లే ఇంజినీరింగ్ బయాలజీ కూడా బయో ఎకానమీని సరికొత్త దశకు తీసుకెళ్లడంలో ఓ పునాదిగా నిలువనుందని చెప్పారు. ఇంజినీరింగ్, బయాలజీ, హెల్త్‌కేర్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో మిశ్రమ కోర్సుల కోసం ఐఐటీలు ఇప్పటికే ప్రత్యేక కార్యక్రమాలతో ప్రతిపాదనలు పంపించడం మొదలుపెట్టాయని వివరించారు. అల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ లాంటి కీలక స్కానింగ్‌లు నిర్వహించడం ఇక రేడియాలజిస్టులకు మాత్రమే పరిమితం కాదని, భవిష్యత్‌లో రేడియాలజిస్టు సాయంతో ఓ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్ కూడా వీటిపై పని చేసే అవకాశం ఉంటుందన్నారు. బయోటెక్నాలజీ రంగంలో దేశం వేగంగా పురోగతి సాధిస్తోందని, ప్రస్తుతం దేశ జీవ ఆర్థికవ్యవస్థ విలువ 95 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. 2030 నాటికి ఇది 300 బిలియన్ డాలర్లకు చేరుకుంటుదని అంచనా వేస్తున్నామని, ప్రస్తుతం దేశంలో 11వేలకు పైగా బయోటెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయన్నారు.



# పాలాభిషేకాలు వద్దు!

**మొదటి పేజీ తరువాయి**

లోపంతో బాధపడుతున్న తరుణంలో, పాలను వృథా చేయడం కాంగ్రెస్ సిద్ధాంతాలకు, ఆశయాలకు పూర్తిగా విరుద్ధం' అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఇలాంటి ఆడంబరాలకు బదులు, పేదలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అంతేకాకుండా, సీనియర్ నేతల పర్యటనల సందర్భంగా జేసీబీలు, బుల్డోజర్లతో భారీ దండలు వేయడాన్ని కూడా తీవ్రంగా పరిగణించారు. ఈ యంత్రాలను 'అణచివేతకు చిహ్నాలు'గా పార్టీ అభివర్ణించింది. అనవసర ఆడంబరాలకు దూరంగా ఉంటూ, ప్రజాసేవ, నిరాడంబరత అనే పార్టీ మూల సూత్రాలకు కట్టుబడి ఉండాలని ఆదేశించింది.



# 9వ తరగతిలో మూడో భాష వద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికలో భాగంగా మూడో భాష అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తొమ్మిదో తరగతిలో కొత్త భాషను ప్రవేశపెట్టడం సరికాదని పేర్కొంది. దీనివల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని అభిప్రాయపడింది. దీనికి బదులు.. ఏదైనా కొత్త భాషను ఐదు లేదా ఆరో తరగతిలోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన పిటిషన్ (సీబీఎస్ఈ అంశంపై కాకుండా)ను విచారించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం త్రిభాషా విధానంపై ఈ విధంగా వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో త్రిభాషా విధానం అమలు అవుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న తమిళనాడు ప్రభుత్వం.. వీటిని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు నిరాకరిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ప్రతి జిల్లాలో జేఎన్‌వీ ఏర్పాటును సమర్థిస్తూ మద్రాస్ హైకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వగా.. దీనిని సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో సుప్రీం తాజా తీర్పు వెలువరించింది.

# కరోనాతో నలుగురు మృతి

**మొదటి పేజీ తరువాయి**

పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# 500 మంది రోహింగ్యాలు జల సమాధి

**మొదటి పేజీ తరువాయి**

సమాచారం ప్రకారం.. ప్రతికూల వాతావరణంతో ఈ రెండు పడవలు బోల్తాపడ్డాయి. ఇందులో 250 మందితో ఉన్న ఒక పడవతో బయలుదేరిన కొద్దిసేపటికే కమ్యూనికేషన్ సంబంధాలు తెగిపోయాయని, 280 మందితో బయలుదేరిన మరో నౌక బోల్తాపడిందని అధికారులు తెలిపారు. రెండో పడవ మయన్మార్‌లోని ఇరావడి తీరంలో బోల్తాపడి ఉండవచ్చని తెలిపారు. ఈ బోట్లలో ప్రయాణిస్తున్న వారిలో బంగ్లాదేశ్ శిబిరాలకు చెందిన శరణార్థులు కూడా ఉన్నారు. అయితే మృతుల సంఖ్యను అధికారికంగా నిర్ధారించలేదు. ఈ విషాద ఘటనలపై అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఓఎం) సంతాపం వ్యక్తం చేసింది.

# ఈహెచ్‌ఎస్ అమలుపై జీవో జారీ

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఈహెచ్‌ఎస్ పథకాన్ని ఈ నెల 15వ తేదీన అధికారికంగా ప్రారంభించాలని అనుకున్నారు. అదే రోజు నుంచి ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందించాలని ఇటీవల నిర్వహించిన ఉద్యోగుల హెల్త్‌కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) సమావేశాల్లో నిర్ణయించారు. అయితే, ఇప్పటివరకు పథకం విధి విధానాలు ఖరారు కాకపోవడం, వివిధ వ్యాధుల చికిత్సకు రేట్లను పెంచాలని ఆసుపత్రులు డిమాండ్ చేస్తుండటం తదితర కారణాలతో కార్యక్రమం అమలు తాత్కాలికంగా వాయిదా పడింది. తాజాగా పథకం అమలుపై స్పష్టత రావడంతో ప్రభుత్వం ఈ మేరకు జీవో జారీ చేసింది.

దొరికిన లంచగొండి



# బాబ్బాబు.. బిచ్చం!

## ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఇంజినీర్లు

ఆదిలాబాద్, జూలై 16 (ఈవార్తలు): ఆదిలాబాద్ జిల్లా నీటి పారుదల శాఖలో పని చేస్తున్న ఇద్దరు ఇంజినీర్లు గురువారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా సొనాలకు చెందిన వ్యక్తి పౌల్ట్రీఫామ్ ఏర్పాటు చేసుకునే స్థలం వద్ద సాగునీటి శాఖకు చెందిన కాలువ ఉండటంతో ఎన్వోసీ అవసరమైంది. అది ఇవ్వాలంటే రూ.లక్ష ఇవ్వాలని ఈఈ రాథోడ్ విఠల్, అసిస్టెంట్ ఇంజినీర్ రూపావత్ రమేశ్ డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా ఎన్వోసీలు జారీ చేయకుండా ఇబ్బందులు పెడుతుండటంతో బాధితుడు రూ.60 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం ఆదిలాబాద్‌లోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఈఈ రాథోడ్ విఠల్, అసిస్టెంట్ ఇంజినీర్ రూపావత్ రమేశ్‌కు బాధితుడు రూ.60 వేలు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పక్కా స్కెచ్ వేసి పట్టుకున్నారు. నిందితులిద్దరిను అదుపులోకి తీసుకున్నామని, తదుపరి విచారణ కొనసాగిస్తున్నామని ఏసీబీ డీఎస్పీ జీ మధు పేర్కొన్నారు.



# నాచారం చెరువు సుందరీకరణ పనులు షురూ

**రూ.28 కోట్ల వ్యయంతో 9 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక**

ఉప్పల్-హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఉప్పల్ పరిధిలో గల నాచారం పెద్ద చెరువు పునరుజ్జీవం పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 28 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను తొమ్మిది నెలల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. సుమారు 108.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా చెరువులో 10 అడుగుల లోతు వరకు పూడిక తీయడం, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, కట్టను పటిష్ఠం చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. కట్టపై పాదచారుల మార్గాలు, ల్యాండ్‌స్కేప్ పార్కులు, చిన్నారుల కోసం ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లు, యోగా వేదికలను ఏర్పాటు చేయనున్నారు. స్థానికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలకు ఈ ప్రాజెక్టు ద్వారా పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు. చెరువులోకి మురుగునీరు చేరడం, దుర్వాసన, దోమల బెడదతో పాటు సమీప కాలనీల్లో వరద ముంపు సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల భూగర్భ జలమట్టం కూడా మెరుగుపడుతుందని వివరించారు. అనంతరం, కమిషనర్ రంగనాథ్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా యాప్రాల్‌లోని నాగిరెడ్డి కుంటను సందర్శించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో, ప్రభుత్వ భూముల్లో కబ్జాలు జరుగుతున్నాయని, వరద కాలువలను పూడ్చివేయడం వల్ల తమ కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన కమిషనర్, ఆక్రమణలను తొలగించి, నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఓట్లు వేయలేదనే 'సీతారామ'ను వదిలేశారు

## బీఆర్‌ఎస్‌పై పొంగులేటి ఫైర్

ఖమ్మం, జూలై 16 (ఈవార్తలు): ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి గురువారం ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు



కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## ఘనంగా తొలి

# 'తెలంగాణ స్కిల్స్ డే' వేడుకలు

**ఇప్పటివరకు 1,775 మంది విద్యార్థులకు ఉద్యోగాలు.. జర్మన్, జపనీస్ తదితర భాషల శిక్షణ కోసం 'ఇఫ్లూ'తో ఒప్పందం**

**తెలంగాణను దేశంలోనే నంబర్ 1 స్కిల్ స్టేట్‌గా తీర్చిదిద్దుతాం**

**ఆఫర్ లెటర్లు పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి**




హైదరాబాద్, జూలై 16: నైపుణ్యమే యువత జీవితాలను మార్చే అసలైన శక్తి అని, ప్రతి యువకుడికి నాణ్యమైన శిక్షణతో పాటు ఉద్యోగం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ ఓ ఫ్యాక్టరీస్) మరియు గనులు శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (డీఈటీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కొమరం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తొలి 'తెలంగాణ స్కిల్స్ డే' కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఉద్యోగాలు సాధించిన శిక్షణార్థులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన యువతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. అలాగే విదేశీ ఉపాధి అవకాశాల కోసం ఎంపికైన 19 మంది ఫిజియోథెరపిస్టులకు ఆఫర్ లెటర్లను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి పరిశ్రమ మొదట అడిగేది స్కిల్డ్ మ్యాన్‌పవర్ గురించేనని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే నంబర్-1 స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. గతంలో ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందలేకపోయారని, ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐలను టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేసినట్లు మంత్రి తెలిపారు. సీఎన్‌సీ, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ టూల్స్, ఆటోమేషన్ వంటి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 6 దీర్ఘకాలిక, 23 స్వల్పకాలిక కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ మార్పులతో రాష్ట్రంలో శిక్షణ సామర్థ్యం 18,484 నుంచి 34,344 మందికి పెరిగిందని, 2025--27 విద్యాసంవత్సరంలో 99 శాతం సీట్లు భర్తీ కావడం యువతలో ఈ కోర్సులపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 65 ప్రభుత్వ ఐటీఐల్లో 35 ట్రేడ్లలో 15,860 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ) ప్రమాణాల ప్రకారం శిక్షణ పూర్తిచేసిన వారికి జాతీయ స్థాయి ఎన్‌సీవీటీ సర్టిఫికేషన్ లభిస్తోందని, దీంతో ప్రభుత్వ, ప్రైవేట్, కేంద్ర సంస్థలతో పాటు విదేశాల్లో కూడా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం కలుగుతోందన్నారు. ష్నైడర్, సీమెన్స్, ఇండో-జర్మన్ గ్రీన్ స్కిల్స్ ప్రోగ్రామ్, ఎడ్యునెట్ ఫౌండేషన్, నిర్మాణ్ ఫౌండేషన్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ద్వారా శిక్షకులకు శిక్షణ, ఆన్-ది-జాబ్ ట్రైనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. టాటా టెక్నాలజీస్ సామాజిక బాధ్యతలో భాగంగా భారీగా పెట్టుబడులు పెట్టి ఆధునిక ల్యాబ్‌లు, యంత్రాలు, ఫ్యాకల్టీని అందించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ చర్యల ఫలితంగా హైదరాబాద్, ఉట్నూర్, వరంగల్, నిజామాబాద్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఏడు జాబ్‌మేళాల్లో 116 పరిశ్రమలు పాల్గొనగా, 2,572 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరై 1,775 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మంత్రి తెలిపారు. ఇందులో 1,216 మంది ఏటీసీ విద్యార్థులు, 559 మంది ఐటీఐ విద్యార్థులు ఉన్నారన్నారు. ఎంపికైన వారికి సగటున రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నెలవారీ వేతనంతో ఉద్యోగాలు లభించాయని తెలిపారు. విదేశీ ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం జర్మన్, జపనీస్‌తో పాటు ఇతర విదేశీ భాషల్లో శిక్షణ అందించేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జర్మనీలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల అవసరం ఉందని, భాషా నైపుణ్యాలు నేర్చుకుంటే తెలంగాణ యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉన్నత వేతనాలతో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఇటీవల జర్మనీ పర్యటనలో అక్కడి ప్రభుత్వ ప్రతినిధులు తెలంగాణలోని స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను ప్రత్యేకంగా ప్రశంసించారని వెల్లడించారు. విద్యార్థులు శిక్షణను మధ్యలో విడిచిపెట్టకుండా పట్టుదలతో పూర్తిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఐటీఐ, ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించనుందని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు నిధుల కొరత రానివ్వబోమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటీషన్లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తామని ప్రకటించారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు అలుమ్నీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక నైపుణ్య శిక్షణను విస్తరించేందుకు 54 కొత్త అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఇప్పటికే 281.39 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించామని మంత్రి తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో 50 వేల మంది యువతకు శిక్షణ అందించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే జూలై 26 నుంచి ఆగస్టు 30 వరకు రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో మరో విడత భారీ జాబ్‌మేళాలు నిర్వహించి 10 వేల మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తెలంగాణ యువత నైపుణ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి, శిక్షణ నుంచి ఉద్యోగం వరకు సమగ్ర వ్యవస్థను నిర్మించడం ద్వారా రాష్ట్రాన్ని దేశంలోనే స్కిల్ డెవలప్‌మెంట్‌లో నంబర్-1 రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.



# మెట్రో ఫేజ్ 1లో అదనపు కోచ్‌లు

**ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు హెచ్‌ఎంఆర్‌ఎల్ నిర్ణయం**

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్-1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్-1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్‌ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు, భద్రతతో పాటు స్టేషన్ల పరిశుభ్రతకు తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ హబ్‌లను కలుపుతూ పబ్లిక్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# డ్రగ్స్ కేసులో ఎమ్మెల్సీ కొడుకు?

**మంగళ్‌హాట్‌లో డ్రగ్స్ ముఠాపై పోలీసుల దాడి**

**నా కొడుకు డ్రగ్స్ తీసుకోలేదు: ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి**

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారం మరోసారి కలకలం రేపింది. నగరంలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో పోలీసులు జరిపిన దాడిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పి. వెంకట్రామ్ రెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డితో పాటు మరో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, తన కుమారుడు డ్రగ్స్ వినియోగించలేదని, అతడిని అరెస్ట్ చేయలేదని ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ కథనం మేరకు.. బుధవారం రాత్రి మంగళ్‌హాట్‌లో ఓ ముఠా గంజాయి, హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి సేవిస్తోందని తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, యునిత్‌లను పట్టుకోగా, మరో నలుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల హ్యాష్ ఆయిల్, 22 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న సోని, వంశీ, మనోజ్, తులిజాల కోసం గాలిస్తున్నారు. కాగా, ఈ ఆరోపణలను ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తన కుమారుడు భరత్ రెడ్డి డ్రగ్స్ తీసుకున్నాడని, అతడిని అరెస్ట్ చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. "ఒక కామన్ ఫ్రెండ్ ఫోన్ కాంటాక్ట్ లిస్ట్‌లో నంబర్ ఉండటంతో, డ్రగ్స్ కేసుకు సంబంధించి విచారణకు సహకరించాలని పోలీసులు మా ఇంటికి వచ్చారు. విచారణలో నా కుమారుడు డ్రగ్స్ తీసుకోలేదని తేలింది. అతడిని అరెస్ట్ చేయలేదు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో తరచూ డ్రగ్స్ కేసులు నమోదవుతుండటంతో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# మెడికల్ బోర్డు సింగరేణి కార్మికుల గెలుపు

**ఇకపై ప్రతి నెల తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి**

**కాంగ్రెస్ సర్కార్‌కు కల్వకుంట్ల కవిత డిమాండ్**



హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఈనెల 17, 18 తేదీల్లో మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికుల విజయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలంటూ హెచ్‌ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన గాంధేయమార్గంలో జరిపిన పోరాటానికి ప్రభుత్వం దిగివచ్చిందని గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఐతే తాత్కాలికంగా మాత్రమే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయటం కాకుండా కచ్చితంగా నెలకొకసారి మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారసత్వ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల చట్టబద్ధమైన హక్కు అని చెప్పారు. వేలాది మంది కార్మికులు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇన్నాళ్లు ప్రభుత్వం పట్టించుకోకపోవడం కారణంగా వారంతా తీవ్ర మనో వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా తప్పనిసరిగా మెడికల్ బోర్డును ఏర్పాటు చేయటంతో పాటు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలన్నారు. కాగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక, హైదరాబాద్ నగర ప్రజల ఐక్యతకు చిహ్నమైన ఆషాఢ బోనాల ప్రారంభోత్సవం సందర్భంగా అందరికీ కవిత బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# హిందువులపై దాడులు సహించం

**ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి హెచ్చరిక**

ఆర్మూర్, జూలై 16 (ఈవార్తలు): హిందువులందరూ ఐక్యంగా ఉంటూ, సమాజంపై దాడులు జరిగినప్పుడు సమష్టిగా స్పందించి భవిష్యత్తును కాపాడుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ కేంద్రంలో గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హిందూ సమాజంపై ఎక్కడ దాడి జరిగినా, అందరూ ఏకమై నిరసనలు, ఉద్యమాల ద్వారా సమర్థంగా ప్రతిఘటించాలని ఆయన సూచించారు. గతంలో చోటుచేసుకున్న కొన్ని ఘటనలను ప్రస్తావిస్తూ, పిప్రిలో ఒక హిందువు ఇంటిని తగులబెట్టినప్పుడు సమాజం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర వర్గాలకు చెందిన వ్యక్తులపై చిన్న దాడి జరిగినా వేలాదిగా తరలివచ్చే పరిస్థితి ఉందని, హిందువుల్లోనూ అదే తరహా ఐక్యత రావాలని ఆకాంక్షించారు. హిందువులు సంఘటితంగా లేకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకపై హిందువులపై జరిగే దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లో ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి మున్సిపాలిటీ తరఫున ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తామని రాకేశ్ రెడ్డి ప్రకటించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఫైలుపై సంతకం చేసిన వెంటనే, మందిరం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.

# కల్మా చదువుకొని రా!

### విద్యార్థి డైరీలో టీచర్ హోమ్ వర్క్

### హైదరాబాద్ సక్సెస్ స్కూల్లో ఘటన

సైదాబాద్-హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని సైదాబాద్ పరిధిలో ఉన్న సక్సెస్ స్కూల్ చుట్టూ ఇప్పుడో పెద్ద గొడవ జరుగుతోంది. కేవలం రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి.. కల్మా చదువుకుని రావాలంటూ ఓ టీచర్ హోమ్ వర్క్ ఇచ్చింది. ఇది మాత్రమే కాకుండా మరికొన్ని మత ప్రార్థనలను కూడా నేర్చుకుని రావాలంటూ సదరు విద్యార్థి.. డైరీలో రాసి పంపించింది. అయితే ఇంటికొచ్చాక ఆ డైరీ చూసిన విద్యార్థి తల్లిదండ్రులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా మరుసటి రోజు బడికి వెళ్లి మరీ.. చిన్న వయసులోనే విద్యార్థులపై మతపరమైన అంశాలను రుద్దే ప్రయత్నం చేయడం దారుణం అంటూ గొడవకు దిగారు. అసలు హిందూ బాలుడికి కల్మా చదవాలని ఎలా నేర్పిస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు, పాఠశాల వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. సైదాబాద్ సక్సెస్ స్కూల్‌లో ఒక హిందూ బాలుడు రెండో తరగతి చదువుతున్నాడు. కాగా తరగతి గదిలో పాఠాలు చెప్పే సమయంలో సదరు క్లాస్ టీచర్.. ఆ బాలుడికి ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన కల్మా, సూరహ్ ఫాతిహాలను చదవడం నేర్చుకోవాలని హోమ్‌వర్క్ ఇచ్చింది. అంతటితో ఆగకుండా ఆ విద్యార్థి ప్రతిరోజూ ఇంటికి తీసుకెళ్లే స్కూల్ డైరీలో సైతం.. కల్మా, సూరహ్ ఫాతిహా చదవాలి అని స్పష్టంగా పెన్నుతో రాసింది. బాలుడు ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు అతని హోమ్‌వర్క్ పుస్తకాలు, డైరీని పరిశీలించగా ఈ షాకింగ్ విషయం బయటపడింది. చిన్న వయసులోనే ఇస్లామిక్ ప్రార్థనలను హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై బాలుడి తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మరుసటి రోజు ఉదయమే వారు మరికొంత మంది బంధువులను, స్థానికులను వెంటబెట్టుకుని నేరుగా సైదాబాద్ సక్సెస్ స్కూల్‌కు చేరుకున్నారు. డైరీలో రాసిన మతపరమైన అంశాలను చూపించి, సదరు ఉపాధ్యాయురాలితో పాటు స్కూల్ డైరెక్టర్లను, యాజమాన్యాన్ని సూటిగా ప్రశ్నించారు. సెక్యులర్ విద్యావిధానాన్ని అమలు చేయాల్సిన విద్యా సంస్థల్లో ఒక నిర్దిష్ట మత ప్రార్థనలను ఇతర మతాల పిల్లల చేత బలవంతంగా చదివించే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని వారు గట్టిగా నిలదీశారు. ఈ సంఘటనతో పాఠశాల ప్రాంగణంలో కాసేపు గందరగోళ వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యా సంస్థల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు సదరు పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# స్కూళ్లలో బొట్టు కంపల్సరీ చేస్తాం!



### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహ్ చదవాలని హోంవర్క్ ఇచ్చారన్న వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సంస్కృతిపై బలవంతంగా దాడి చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహ్ చదవాలని ఆదేశించడం దుర్మార్గమని విమర్శించారు. సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

## వెల్గటూర్‌లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

వెల్గటూర్, జూలై 16 (ఈవార్తలు): మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో గురువారం పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. కిరాణా దుకాణాలు, పాన్‌షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న నేపథ్యంలో వాటి నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగానే డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వెల్గటూర్ ఎస్సై ఉదయ్‌కుమార్ సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## గూడ్స్ వాహనాల్లో కూలీల తరలింపుపై రవాణా శాఖ కొరడా

### బోయినపల్లి మండలంలో వాహనం సీజ్.. కూలీలకు రోడ్డు భద్రతపై అవగాహన

బోయినపల్లి, జూలై 15 (ఈవార్తలు): వరి నాట్ల సీజన్ నేపథ్యంలో వ్యవసాయ కూలీలను గూడ్స్ వాహనాల్లో తరలిస్తున్న వారిపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇటీవల కూలీలతో వెళ్తున్న వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదం నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లె వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వంశీధర్ తనిఖీలు నిర్వహించి, కూలీలను అక్రమంగా తరలిస్తున్న ఓ గూడ్స్ వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం సమీపంలోని వరి పొలాల్లో నాట్లు వేస్తున్న కూలీలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రయాణికులను గూడ్స్ వాహనాల్లో తరలించడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాపాయానికి దారితీస్తుందని వివరించారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు తప్పనిసరిగా ప్రయాణికుల కోసం అనుమతించిన వాహనాల్లోనే ప్రయాణించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలించే వాహన యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు.

## ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా సెర్హీ కోరెట్స్కీ

కీవ్: రష్యాతో భీకర యుద్ధం కొనసాగుతున్న తరుణంలో ఉక్రెయిన్‌లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ నూతన ప్రధానమంత్రిగా ఇంధన రంగ నిపుణుడు సెర్హీ కోరెట్స్కీ నియమితులయ్యారు. ఆయన నియామకానికి ఉక్రెయిన్ పార్లమెంట్ గురువారం ఆమోదముద్ర వేసింది. దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, ఈ రంగానికి చెందిన అనుభవజ్ఞుడికి ప్రధాని పగ్గాలు అప్పగించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రధాని యూలియా స్విరిడెంకో తన పదవికి రాజీనామా చేయగా, ఆమె స్థానంలో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ 'నాఫ్టోగాజ్' సీఈఓగా పనిచేస్తున్న సెర్హీ కోరెట్స్కీ పేరును జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించిన తర్వాత ఉక్రెయిన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడో వ్యక్తిగా కోరెట్స్కీ నిలిచారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కోరెట్స్కీ తన ప్రాధాన్యతలను స్పష్టం చేశారు.

## ప్రియాంక గాంధీ పేరుతో రూ.3 కోట్ల మోసానికి యత్నం

తిరువనంతపురం: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ సైబర్ నేరగాళ్లు కేరళ కాంగ్రెస్ నాయకులను మోసం చేసేందుకు యత్నించారు. రాష్ట్రంలో మంత్రి పదవులు ఇప్పిస్తామని నమ్మబలికి, వారి నుంచి కోట్ల రూపాయలు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు సైబర్ మోసం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మోసం ఎలత్తూర్ ఎమ్మెల్యే విద్యా బాలకృష్ణన్‌కు జులై 6న వచ్చిన ఒక వాట్సాప్ కాల్‌తో వెలుగులోకి వచ్చింది. ప్రియాంక గాంధీ ఢిల్లీ కార్యాలయం నుంచి 'రాజ్‌కుమార్' అనే వ్యక్తిని మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్న కాలర్, కేరళలో త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందని నమ్మబలికాడు. మంత్రి పదవి కావాలంటే రూ.3 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఇదే నంబర్ నుంచి వడకర ఎంపీ షఫీ పరంబిల్, ఇడుక్కి ఎంపీ డీన్ కురియాకోస్‌లకు కూడా ఇటువంటి కాల్స్ వచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ వ్యక్తిగత కార్యదర్శి డి.ఎస్. రాజ్‌కుమార్ కేరళ డీజీపీకి, వయనాడ్ ఎస్పీకి అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో కల్పేట సైబర్ పోలీసులు, కోజికోడ్ సైబర్ సెల్ వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రాజ్యసభ పదవికి కోయల్ మల్లిక్ రాజీనామా

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ నటి, ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ కోయల్ మల్లిక్ తన పదవికి రాజీనామా చేశారు. గురువారం తన రాజీనామా లేఖను రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని ఆ లేఖలో కోరారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన కోయల్, పదవి చేపట్టిన కొద్ది నెలలకే వైదొలగడం గమనార్హం. ఎంపీగా ఎన్నికైనప్పటికీ, ఆమె ఇప్పటివరకు కనీసం ఒక్క సెషన్‌కు కూడా హాజరుకాలేదని సమాచారం. కోయల్ నిష్క్రమణతో ఇటీవలి కాలంలో టీఎంసీ నుంచి తప్పుకున్న రాజ్యసభ ఎంపీల సంఖ్య నాలుగుకు చేరింది. గతంలో సుఖేందు శేఖర్ రే, సుస్మితా దేవ్, ప్రకాశ్ చిక్ బరైక్ వంటి నేతలు కూడా రాజీనామా చేశారు. ఈ వరుస పరిణామాలతో ఎగువ సభలో టీఎంసీ బలం 9కి పడిపోయింది. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎదుర్కొంటున్న అంతర్గత సవాళ్ల మధ్య ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు పార్టీని వీడి బీజేపీ వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

# ఇదే చివరి అవకాశం

### పాక్‌కు పీఓకే ఆందోళనకారుల అల్టిమేటం

### జులై 21 వరకు లాంగ్‌మార్చ్‌ను నిలిపివేసిన జేఏఏసీ



ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో కొనసాగుతున్న ఆందోళనలు కీలక మలుపు తిరిగాయి. పాక్ ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తున్న 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' (జేఏఏసీ) తన లాంగ్‌మార్చ్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే తమ డిమాండ్లపై చర్యలు తీసుకునేందుకు ఇదే చివరి అవకాశం అంటూ ఇస్లామాబాద్‌కు హెచ్చరిక జారీ చేసింది. జులై 14తో గడువు ముగియడంతో జేఏఏసీ వేలాది మందితో ముజఫరాబాద్ వైపు లాంగ్‌మార్చ్‌కు పిలుపునిచ్చింది. మహిళలు, చిన్నారులు కూడా పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఓకేలోని పలు ప్రాంతాల నుంచి నిరసనకారులు రావల్‌కోట్‌తో పాటు ఇతర నిరసన కేంద్రాలకు చేరుకున్నారు. ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ అధికారులతో జేఏఏసీ నేతలు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. అనంతరం జేఏఏసీ నాయకుడు ఉమర్ నజీర్ కశ్మీరీతో జరిగిన చర్చల తర్వాత జులై 21 వరకు లాంగ్‌మార్చ్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటిలోగా స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే జులై 22 నుంచి ముజఫరాబాద్ వైపు మార్చ్‌ను తిరిగి ప్రారంభిస్తామని హెచ్చరించారు. పీఓకేలో కొనసాగుతున్న ధర్నాలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు రావల్‌కోట్ పరిసరాల్లో నిరసనకారులు, పాకిస్థాన్ భద్రతా బలగాల మధ్య జరిగిన ఘర్షణల్లో మరణాల సంఖ్య 30కు చేరినట్లు సమాచారం. ఒక్క ఘటనలోనే జేఏఏసీకి చెందిన ఏడుగురు కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడైంది. రహదారులు మూసివేయడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, సరఫరాలను అడ్డుకోవడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. విదేశాల్లోని కశ్మీరీ ప్రవాసులు కూడా పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. పీఓకేలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ కూడా పీఓకే పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ పాత్రపై ప్రశ్నలు లేవనెత్తారు. పీఓకేలో ఆరు వారాలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వేలాది మంది రావల్‌కోట్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. జేఏఏసీ నేత సర్దార్ అమ్మాన్ ఖాన్ మాట్లాడుతూ.. పీఓకేను 'వివాదాస్పద ప్రాంతం'గా కాకుండా 'బలవంతంగా ఆక్రమించిన భూభాగం'గా పేర్కొనాలని పిలుపునిచ్చారు. పీఓకేలో కర్ఫ్యూ, దిగ్బంధం, కమ్యూనికేషన్ సేవల నిలిపివేత మధ్య పాకిస్థాన్ బలగాలు పౌరులపై కఠిన చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు.



# పూరీ రథయాత్రలో ఇద్దరు మృతి

పూరీ: ఒడిశాలోని పూరీలో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల్లో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. సుమారు 40 నుంచి 50 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు, గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజె క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే, ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకు పైగా ఆలస్యమైంది.

## ఢిల్లీ వర్సిటీలో 'హ్యాపీనెస్' పాఠాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన 'సైన్స్ ఆఫ్ హ్యాపీనెస్' కోర్సుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు 2,000 మందికి పైగా విద్యార్థులు ఈ కోర్సులో చేరినట్లు విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించారు. రేఖీ ఫౌండేషన్ ఫర్ హ్యాపీనెస్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రెండేళ్ల క్రితం ఈ కోర్సును ప్రారంభించారు. ప్రస్తుతం సైకాలజీ విభాగంతో పాటు 17 అనుబంధ కళాశాలల్లో ఇది అందుబాటులో ఉంది. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మొదటి నాలుగు సెమిస్టర్లలో నైపుణ్య ఆధారిత ఎలెక్టివ్‌గా దీనిని బోధిస్తున్నారు. ఈ కోర్సు అమలు, విద్యార్థులపై దాని ప్రభావంపై వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రతినిధులు సానుకూల స్పందన వ్యక్తం చేశారు. ఆనందాన్ని శాస్త్రీయ దృక్కోణంలో అర్థం చేసుకోవడం, మానసిక శ్రేయస్సు, భావోద్వేగ స్థైర్యం, స్వీయ అవగాహన పెంపొందించుకోవడం వంటి కీలక అంశాలపై ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడం, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశాలు. ఈ సందర్భంగా వీసీ యోగేష్ సింగ్ మాట్లాడుతూ, "ప్రపంచం ఎంతో అద్భుతమైనది.

# ఈ20 పెట్రోల్‌తో కారు పాడైంది

### కొత్త వాహనం లేదా పూర్తి డబ్బు వాపస్ ఇవ్వాలన్న వినియోగదారుల కోర్టు

### మారుతి సుజుకికి లక్ష రూపాయల జరిమానా




రాయ్‌పూర్: ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వినియోగంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ జిల్లా వినియోగదారుల కోర్టు ఒక కీలక తీర్పును వెలువరించింది. ఈ20 ఇంధన వినియోగం కారణంగా దెబ్బతిన్న మారుతీ గ్రాండ్ విటారా కారు స్థానంలో ఈ20 ఇంధనంతో పనిచేసే కొత్త వాహనాన్ని అందించాలని, లేదా కొనుగోలు మొత్తాన్ని పూర్తిగా వాపసు చేయాలని మారుతీ సుజుకీ సంస్థను, సదరు డీలర్‌ను ఆదేశించింది. ఈ తరహా వివాదంలో దేశంలోనే వెలువడిన తొలి తీర్పు ఇదే కావడం విశేషం. రాయ్‌పూర్‌కు చెందిన నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్‌రాజ్ దేవతా 2023లో 'మారుతి గ్రాండ్ విటారా స్ట్రాంగ్ హైబ్రిడ్ జెటా ప్లస్' మోడల్‌ను కొనుగోలు చేశారు. అయితే, కారులో ఈ20 పెట్రోల్ వినియోగించినప్పటి నుంచి ఇంజిన్ తరచూ నిలిచిపోవడంతో పాటు పనితీరులో లోపాలు తలెత్తుతున్నాయని ఆయన వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన కోర్టు, జూలై 14న 23 పేజీల సమగ్ర తీర్పును వెలువరించింది. సదరు వాహనం ఈ20 ఇంధనానికి అనుకూలమైనది కాదని, విక్రయ సమయంలో ఈ విషయాన్ని వినియోగదారుడికి వెల్లడించకపోవడం 'సేవా లోపం' మరియు అనుచిత వ్యాపార విధానం కిందకు వస్తుందని కోర్టు స్పష్టం చేసింది. తీర్పు వెలువడిన 45 రోజుల్లోగా ఫిర్యాదుదారుకు కొత్త కారును అందజేయాలని, లేనిపక్షంలో వాహనం ఎక్స్-షోరూమ్ ధర రూ. 18.29 లక్షలు, ఆర్‌టీఓ ఛార్జీలు రూ. 1.86 లక్షలు, ఇన్సూరెన్స్ ప్రీమియం రూ. 34,644 కలుపుకుని మొత్తం రూ. 20.50 లక్షలను వాపసు చేయాలని ఆదేశించింది. వీటితో పాటు, వినియోగదారుడు ఎదుర్కొన్న మానసిక ఆవేదనకు పరిహారంగా రూ. 1 లక్ష, న్యాయపోరాట ఖర్చుల నిమిత్తం మరో రూ. 10,000 చెల్లించాలని తీర్పులో పేర్కొంది. కాగా, ఇంధనం నాణ్యత లోపం లేదా కల్తీ కారణంగానే సమస్య తలెత్తిందని, తమ తయారీలో ఎటువంటి లోపం లేదని మరుతీ సుజుకీ సంస్థ, డీలర్ వాదించారు. ఈ తీర్పుపై ఉన్నత ఫోరమ్ లలో అప్పీల్ చేసుకునే అవకాశం సదరు సంస్థకు ఉంది. ఏది ఏమైనప్పటికీ ఇంధన రకం, అనుకూలతపై స్పష్టత లేని సందర్భాల్లో ఈ తీర్పు భవిష్యత్తులో ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# వస్తుంటారు.. పోతుంటారు!

### ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులపై ప్రభావం ఉండదని హామీ




న్యూఢిల్లీ: కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ రెండు అంశాల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల భద్రతకు, పురోగతికి ఎలాంటి విఘాతం కలగదని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ గ్రూప్, కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 19,000 ఫైళ్లను డార్క్ వెబ్‌లో బహిర్గతం చేసినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 14.3 జీబీ డేటా కలిగిన ఈ ఫైళ్లలో ప్లాంట్ బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, ప్లాంట్‌కు సంబంధించిన ఎటువంటి సున్నితమైన సమాచారం లీక్ కాలేదని, వ్యూహాత్మక భద్రతకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పారు. ఈ డేటా లీక్ అనేది ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకరికి చెందిన థర్డ్-పార్టీ సర్వర్ నుంచి పాక్షికంగా జరిగినట్లు గుర్తించామని, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని వివరించారు. మరోవైపు, గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న గ్రూప్ 'ఏ' శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను తక్షణమే ఆమోదించవద్దని అంతరిక్ష విభాగం జులై 14న ఒక మెమో జారీ చేసింది. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయమని, ఉన్నత స్థాయిలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చాలామంది వస్తుంటారు, పోతుంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ సైతం ఈ నిర్ణయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.



## గోల్కొండ అమ్మవారిని దర్శించుకున్న మాగంటి సునీత

హైదరాబాద్, జూలై 17 (ఈవార్తలు): యూసఫ్‌గూడ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిన్న యాదవ్ ఆధ్వర్యంలో గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించిన సందర్భంగా, వారి ఆహ్వానం మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ మాగంటి సునీత గోపీనాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ ప్రజలకు ఆషాఢ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిన్నా రమేష్, నవీన్ పటేల్, నాగరాజు, శ్రవణ్, అమ్మాజీ, అశోక్ అజయ్, శరత్, రవి కళ్యాణ్, వేణుగోపాల్‌తో పాటు వివిధ డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కడప వ్యవసాయ శాఖ ఏడీ గోలి లక్ష్మీ మాధవి పద్మశాలీల సన్మానం

కడప, జూలై 17 (ఈవార్తలు): కడప జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలిగా (ఏడీ) బాధ్యతలు స్వీకరించిన శ్రీమతి గోలి లక్ష్మీ మాధవిని పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి పద్మశాలీయుల ఖ్యాతిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. గోలి లక్ష్మీ మాధవిని అభినందించిన వారిలో పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాసా కోదండరామ్, కడప జిల్లా అధ్యక్షుడు నూకల చిన్న కుళాయప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు జింక జయలక్ష్మి, కడప అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆలూరు నరసింహులు పాల్గొన్నారు.




## ఖమ్మం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం

ఖమ్మం, జూలై 17 (ఈవార్తలు): ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎస్‌పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, డా. నరేందర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందుతున్నాయని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డా. నరేందర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ఆస్పత్రికి మంచి పేరు వస్తుందని అన్నారు. వైద్యం కోసం వచ్చే రోగులు, వారి బంధువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన సేవలు అందించేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. బెడ్‌సైడ్ కార్మికుల వేతనాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తోందని, త్వరలోనే వారి వేతనాలు పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎస్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్ నాగమణి, ఆర్. పద్మ, జిల్లా అధ్యక్షురాలు బత్తుల మమత, ప్రధాన కార్యదర్శి కర్ష జగదీష్, కోశాధికారులు బాడిష హరీష్, ఏపూరి నాగమల్లిక, గౌరవ సలహాదారులు పి. నాగేశ్వరరావు, ఎస్. రాధ, ఉపాధ్యక్షులు అలవాల అపర్ణ, గద్దల కళ్యాణి, సహాయ కార్యదర్శి ఎస్.కె. అజారుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. నాగేంద్ర, సభ్యులు జి. సుజాత, డి. వెంకటమ్మ, బి. అరుణమ్మ, సీహెచ్. మహేష్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**



జగిత్యాల, జూలై 16 (ఈవార్తలు): జగిత్యాల పట్టణాభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం ఎంతో అవసరమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. నాలుగు దశాబ్దాలుగా జిల్లా ప్రజలకు సేవలందిస్తున్న రోటరీ క్లబ్ పట్టణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గురువారం జగిత్యాల రోటరీ క్లబ్, ఆపి ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో గొల్లపల్లి రోడ్డులోని సత్యహరిశ్చంద్ర శ్మశానవాటికలో మూడు బాడీ ఫ్రీజర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్, క్లబ్ సభ్యులు పాల్గొని ఫ్రీజర్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ గత 40 ఏళ్లుగా వైద్య, విద్య, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందని కొనియాడారు. శ్మశానవాటికలో బాడీ ఫ్రీజర్ల ఏర్పాటు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ లక్ష్మీరాజు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, ఏ.వి.ఎల్.ఎన్. చారి, టి.వి. సూర్యం, కొత్త ప్రతాప్, త్రివేణి సాగర్, ఎన్నాకుల అశోక్, ఆంటోనీ ముత్తు, మాజీ కౌన్సిలర్లు రాజ్‌కుమార్, బోడ్ల జగదీశ్, నాయకులు రామకృష్ణారెడ్డి, ఆపి కార్యనిర్వాహక సభ్యురాలు రాధిక సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

# గుండుకు డబ్బులు తీసుకుంటే చర్యలు

### వేములవాడ కల్యాణకట్టలో ఈవో ఆకస్మిక తనిఖీ



వేములవాడ అర్బన్, జూలై 16 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం కళ్యాణకట్టలో భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కళ్యాణకట్టకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడిన ఈవో, సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎవరైనా అదనపు డబ్బులు డిమాండ్ చేశారా అని ఆరా తీశారు. అనంతరం విధుల్లో ఉన్న నాయి బ్రాహ్మణుల వివరాలు సేకరించి, వేతనాలు, సౌకర్యాలపై విచారించారు. కాంట్రాక్టర్‌కు అన్ని సిబ్బందికి యూనిఫాం, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. భక్తుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. భక్తుల అవగాహన కోసం కళ్యాణకట్టలో "తలనీలాల టికెట్ ధర రూ.50 మాత్రమే", "అదనపు డబ్బులు చెల్లించవద్దు" అనే బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మైక్ ద్వారా ప్రకటనలు చేయాలని ఆదేశించారు. నగదు వసూళ్లపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు ఇద్దరు సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫుటేజీ ఆధారంగా ఫిర్యాదులను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల అనంతరం దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించిన ఈవో, భక్తులకు పారదర్శకంగా, ఇబ్బందుల్లేని సేవలు అందించాలని ఆదేశించారు. భక్తుల నుంచి ఎవరైనా అదనపు డబ్బులు వసూలు చేస్తే వెంటనే దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఈ తనిఖీల్లో దేవస్థానం డీఈవో నవీన్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి, ఏఈ రామకృష్ణారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## వేములవాడలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**15 రోజుల క్రితమే కుమారుడు జననం**

**దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

వేములవాడ అర్బన్, జూలై 16 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలో ఓ యువ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. పట్టణానికి చెందిన బాలసాని అజయ్ (24) బుధవారం తన నివాసంలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే అజయ్ మృతి చెందినట్లు తెలిసింది. కేవలం 15 రోజుల క్రితమే అతనికి కుమారుడు జన్మించగా, పసికందును వదిలి వెళ్లిపోయాడంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న వేములవాడ పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అజయ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో స్థానిక ఆటో కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. యువ ఆటో డ్రైవర్ అకాల మరణం పట్టణంలో విషాదాన్ని నింపింది.

# నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి సేవలో బండి సంజయ్



కొడిమ్యాల, జూలై 16 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబ సమేతంగా నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు స్థానిక బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం బీజేపీ మండల అధ్యక్షుడు బండ నరసింహారెడ్డి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం టాయిలెట్లు, హైమాస్ట్ లైట్లు, గుట్టపైకి సీసీ రహదారి నిర్మించాలని కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన బండి సంజయ్, భక్తుల సౌకర్యార్థం అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బైరి హరీష్, ఉపాధ్యక్షుడు కడగండ్ల శోభన్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు రేకులపల్లి తిరుపతిరెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు గోనెపల్లి ప్రశాంత్ గౌడ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి బండి అనిల్ యాదవ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మల్యాలలో సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మల్యాల, జూలై 17 (ఈవార్తలు): మల్యాల మండలంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), కల్యాణ లక్ష్మి పథకాల కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## సర్‌పై బీఎల్ఏలకు బీఆర్ఎస్ అవగాహన

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**

**బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి**

మెట్‌పల్లి, జూలై 16 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలోని విధిత్‌రెడ్డి గార్డెన్స్‌లో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) కోసం ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌కుమార్, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ హాజరై బీఎల్ఏలకు మార్గదర్శనం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో బాధ్యతాయుతమైనదని నాయకులు పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హమైన నమోదులు, డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లను చట్టబద్ధంగా గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని నాయకులు అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా అధ్యయనం చేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ బీఎల్ఏలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు గోడపత్రిక ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, జూలై 16 (ఈవార్తలు): నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టీఎస్ సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో చేపడుతున్న జన జాగరణ బస్సు యాత్రకు మద్దతుగా జగిత్యాల జిల్లా టీఎన్‌జీవో, టీజీవో, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల గోడపత్రికను గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయ భవనంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో 33 జిల్లాల గుండా బస్సు యాత్ర నిర్వహించి ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో జూలై 25, 26 తేదీల్లో జరిగే యాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోసం ప్రతి ఒక్కరూ జన జాగరణ యాత్రకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్వ సతీష్, సందుపట్ల రమేష్, అల్లే రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తండాల్లో ఘనంగా సీత్లా పండుగ

రాయికల్, జూలై 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని లోక్య నాయక్‌తండా, మంగత్య నాయక్‌తండాల్లో నిర్వహించిన బంజారా సీత్లా పండుగ వేడుకల్లో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన లంబాడీలు తరతరాలుగా సీత్లా పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, పశువులు క్షేమంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థిస్తారని తెలిపారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, బీఆర్ఎస్ హయాంలో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మరంపెల్లి రాణి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

## దూదేకుల బలోపేతానికి కృషి చేస్తాం

జగిత్యాల, జూలై 16 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర దూదేకుల ముస్లిం జేఏసీ, ప్రచార కార్యదర్శిగా మొహమ్మద్ సయ్యద్, చీఫ్ అడ్వైజర్‌గా వసీం అహ్మద్, ఎన్నికైన సందర్భంగా పలువురు దూదేకుల సంఘం నాయకులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన దూదేకుల ముస్లిం జేఏసీ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దూదేకుల సమాజ అభివృద్ధి, ఐక్యత, హక్కుల సాధన కోసంఅంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మా రక్తం తీసుకో.. రైతులకు నీళ్లివ్వండి

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

చొప్పదండి, జూలై 16 (ఈవార్తలు): సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం గంగాధరలో రక్తదానం చేశారు. 'మా రక్తం అడిగావు కదా.. ఇదిగో మా రక్తం తీసుకుని కాళేశ్వరం జలాలను వెంటనే విడుదల చేయాలి' అంటూ నిరసన తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతుల సాగు కోసం కాళేశ్వరం నీటిని విడుదల చేయాలని కోరినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 'రేవంత్‌రెడ్డి.. మా రక్తం తీసుకో.. రైతులకు కాళేశ్వరం నీళ్లివ్వు' అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వానాకాలం సాగు ప్రారంభమై నెల రోజులు దాటినా వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటలకు నీరు ఇవ్వాలని కోరితే రక్తం పారించాలంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం జలాలను విడుదల చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు.

## సాగునీరు విడుదల చేయాలని రైతుల ధర్నా

**పోతూర్రు బ్రిడ్జిపై ఆందోళన.. స్తంభించిన రాకపోకలు**

ఇల్లంతకుంట, జూలై 17 (ఈవార్తలు): మిడ్ మానేరు జలాశయం నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పోతూర్రు బ్రిడ్జిపై రైతులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని, తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన పంప్‌హౌస్‌లు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటి విడుదలలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే సాగులో ఉన్న వరి పంటలకు అత్యవసరంగా నీరు అవసరమని, వెంటనే విడుదల చేయకపోతే పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని, రైతాంగాన్ని కాపాడాలంటే మిడ్ మానేరు నుంచి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో పోతూర్రు బ్రిడ్జిపై కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం రైతులు ధర్నాను విరమించడంతో రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. ప్రభుత్వం తమ డిమాండ్లపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

## బైక్‌ను ఢీకొన్న కారు.. ఇంటర్ విద్యార్థి మృతి

చందుర్తి, జూలై 17 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఏనగల్ గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంటర్ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. చందుర్తి ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన వద్నాల రాజు (17), చందుర్తి మండలం జలపతి తండాకు చెందిన భూక్య ఆకాశ్ వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరూ బైక్‌పై బాబుసాయిపేటలోని రాజు అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఏనగల్ గ్రామ శివారులో ఎదురుగా వేములవాడ వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వద్నాల రాజు అక్కడికక్కడే మృతి చెందగా, భూక్య ఆకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి వద్నాల రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

## టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 16 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సంస్థ టీ-సేవ ఆన్ లైన్ స్కిల్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీ-సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్ రెడ్డి తెలిపారు. స్కిల్ కేంద్రాల ద్వారా వెయ్యికి పైగా స్కిల్ డెవలప్ మెంట్ కోర్సుల్లో ఆన్ లైన్ శిక్షణ, వివిధ ఆన్ లైన్ సేవలు వినియోగదారులకు అందించడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చునని ఆయన సూచించారు. బస్సు, ట్రైన్, విమాన టికెట్స్ బుకింగ్, వివిధ బ్యాంకుల ద్వారా మనీ ట్రాన్స్ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, క్యాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ అండ్ కార్ ఇన్సూరెన్స్, బిల్లుల చెల్లింపులు, కొత్త పాన్ కార్డుల అప్లై, కరెక్షన్స్ చేయవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు సెల్: 8179955744, వెబ్సైట్: www.tsevaonline.com ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం

**ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

హైదరాబాద్, జూలై 16(ఈవార్తలు): రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ని అందజేసింది.




లయ్యారి చిత్రం





## డిసెంబర్ 3న ఫౌజీ రిలీజ్

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఫౌజీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ సినిమా డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ కానుందని మేకర్స్ వెల్లడించారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో పాటు రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో ప్రభాస్ పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తూ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. 1940ల నాటి కాలాన్ని గుర్తు చేసే డబుల్ బ్యారెల్ గన్ చేతిలో పట్టుకుని, చుట్టూ శత్రువుల మృతదేహాల మధ్య కూర్చున్న ప్రభాస్ లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. భారీ శరీరాకృతి, గంభీరమైన హావభావాలు, ఒంటరిగా భారీ సైన్యాన్ని ఎదుర్కొన్న యోధుడిలా కనిపిస్తున్న ప్రభాస్ గెటప్ పోస్టర్‌కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. సినిమా యాక్షన్ స్థాయి, విజువల్ గ్రాండియర్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో ఈ ఒక్క పోస్టర్‌తోనే మేకర్స్ హింట్ ఇచ్చారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. దాదాపు రెండేళ్లుగా ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. అయితే సినిమా అప్‌డేట్స్, రిలీజ్ డేట్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో పాటు పవర్‌ఫుల్ పోస్టర్‌ను రిలీజ్ చేయడం ద్వారా మేకర్స్ ఫ్యాన్స్ లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. భారత స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన సంఘటనల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాను డైరెక్టర్ హను రాఘవపూడి తన కెరీర్‌లోనే మోస్ట్ ప్రిస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

## రాణి ముఖర్జీకి గౌరవ డాక్టరేట్

బాలీవుడ్ స్టార్ నటి రాణి ముఖర్జీకి ఒక అరుదైన గౌరవం దక్కింది. మెల్‌బోర్న్ వేదికగా జరగనున్న 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' వేడుకల్లో భాగంగా.. ఆస్ట్రేలియాకు



చెందిన ప్రముఖ 'లా ట్రోబ్ యూనివర్సిటీ' ఆమెకు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అందించనుంది. భారతీయ సినిమాకు ఆమె చేసిన అద్భుతమైన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటిస్తున్నారు. ఆగస్ట్ 14న మెల్‌బోర్న్‌లోని ఫెడరేషన్ స్క్వేర్‌లో ఈ డిగ్రీని అందజేయనున్నట్లు సమాచారం. తాజాగా, ఈ విషయంపై రాణి ముఖర్జీ సంతోషం వ్యక్తం చేశారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. లా ట్రోబ్ యూనివర్సిటీ నుండి ఈ గౌరవ డాక్టరేట్ అందుకోవడం తనకు ఎంతో గర్వంగా ఉందని రాణి ముఖర్జీ చెప్పారు. తన జీవిత ప్రయాణంలో సినిమానే తనకు అతిపెద్ద గురువని, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి, ప్రజల్లో సానుభూతిని నింపడానికి కథలకి ఎంతో శక్తి ఉందని తాను ఎప్పుడూ నమ్ముతానని ఆమె తెలిపారు. ప్రపంచ వేదికపై భారతీయ సినిమాను నిరంతరం గౌరవిస్తూ వస్తున్న 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందుకోవడం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోందని అన్నారు. ఇంతటి గొప్ప గుర్తింపు ఇచ్చినందుకు లా ట్రోబ్ యూనివర్సిటీ, ఐఎఫ్ఎఫ్ఎమ్ సంస్థలకి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.



## విజయ్ రాజకీయ భవిష్యత్తును ఎప్పుడో ఊహించా: వరలక్ష్మి

తమిళనాడు రాజకీయాల్లో విజయ్ ఎదుగుదలపై ప్రస్తుతం ఎన్నో చర్చలు జరుగుతున్న వేళ, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ చేసిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారింది. విజయ్ రాజకీయాల్లోకి వచ్చి, రాణిస్తారని తానిప్పుడు అనుకోలేదని, కొన్నేళ్ల క్రితమే ఆయన భవిష్యత్తు దిశను ఊహించానని ఆమె వెల్లడించడం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. సర్కార్ సినిమా షూటింగ్ టైమ్ లో విజయ్‌తో జరిగిన ఓ సంభాషణ తర్వాత ఆయన ప్రయాణం సినిమాలకు మాత్రమే పరిమితం కాదనే అభిప్రాయం తనకు కలిగిందని, ఆ టైమ్ లో వచ్చిన ఆ ఆలోచనే ఇప్పుడు నిజమైనట్లు అనిపిస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం విజయ్ తమిళనాడు రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న నేపథ్యంలో ఆ జ్ఞాపకాన్ని మరోసారి ఫ్యాన్స్ తో పంచుకున్నారు.

## వివాహబంధానికి కొఠారే-ఊర్మిలా కనేట్కర్ గుడ్‌బై

మరో జంట తమ 15 ఏళ్ల బంధానికి స్వస్తి పలికారు. ప్రముఖ నటుడు అద్దినాథ్ కొఠారే, స్టార్ హీరోయిన్ ఊర్మిళా కనేట్కర్ విడాకులు ప్రకటిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. చాలా ఆలోచించిన తర్వాతే తాము స్నేహపూర్వకంగా విడిపోవాలని నిర్ణయం తీసుకున్నట్లు ఈ జంట తెలిపారు. భార్యాభర్తలుగా తమ ప్రయాణం ముగిసినప్పటికీ, తమ ముద్దుల కుమార్తె 'జిజా' పట్ల తమకున్న బాధ్యత,



అంకితభావం ఎప్పటికీ అలాగే ఉంటాయని స్పష్టం చేశారు. తమ కుమార్తెకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, ప్రేమ, భద్రతతో కూడిన వాతావరణంలో ఆమెను కలిసికట్టుగా పెంచుతామని చెప్పారు. తమ మధ్య గడిచిన ఆ సంతోషకరమైన సంవత్సరాల పట్ల, ఒకరిపై ఒకరికి ఎప్పటికీ గౌరవం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇన్నాళ్లు తమను ఆదరించిన మీడియాకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ, జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న ఈ సమయంలో అందరి ఆశీస్సులు కావాలని కోరారు. అలాగే తమ వ్యక్తిగత ప్రైవసీని గౌరవించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విడాకుల విషయమై ఇదే తమ చివరి ప్రకటన అని, దీనిపై తాము ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని స్పష్టం చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. ఇక ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు జీజాను కలిసికట్టుగా పెంచడంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## కాజోల్‌తో నటించాలనుంది: దుల్కర్



మలయాళ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయకుడిగా గుర్తింపు పొందిన నటుడు దుల్కర్ సల్మాన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఈయన కేవలం మలయాళ చిత్రాలకే పరిమితం కాకుండా తెలుగు, తమిళం, హిందీ తదితర భాషల్లో నటిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ 'శ్రీ శ్రీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా కనిపించనుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను దక్కించుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దుల్కర్ సల్మాన్ తనకు అత్యంత ఇష్టమైన నటి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. నాకు అత్యంత ఇష్టమైన నటీమణుల్లో కాజోల్ ఒకరు. తన అద్భుతమైన నటనతో ఎన్నో పాత్రలకు ప్రాణం పోశారు. ఎన్నో సంవత్సరాల పాటు స్టార్ హీరోయిన్‌గా కొనసాగి, ఇప్పటికీ అదే స్థాయిలో తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఎంతోమంది నటీమణులకు ఆమె ఆదర్శంగా నిలిచారు. అందుకే ఆమెంటే నాకు ఎంతో అభిమానం. ఆమెతో కలిసి నటించే అవకాశం వస్తే ఎంతో ఆనందంగా స్వీకరిస్తానని తెలిపారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## ప్రైవసీ ఉండట్లే

బాలీవుడ్ నటి మౌనీ రాయ్ తన జీవితంలో ఎమోషనల్ ఘట్టంలో ఉన్నారు. ముంబై స్టిల్ ఫోటోగ్రాఫర్లు అలాగే, సోషల్ మీడియా వేదికగా నెటిజన్ల నుండి తనకు ఎదురవుతున్న విమర్శలే దీనికి కారణం. తనను ఎక్కడికక్కడ వెంబడిస్తూ ఫోటోలు, వీడియోలు తీయడం ఆపాలన మౌని ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఎమోషనల్ అప్పీల్ చేశారు. తన ప్రైవసీని గౌరవించాలని.. దయచేసి తనను ఇకపై కెమెరాల్లో బంధించవద్దని మౌని ఫోటోగ్రాఫర్లను వేడుకున్నారు. తాను ఎప్పుడూ ఫోటోగ్రాఫర్లను ప్రత్యేకంగా పిలవలేదని.. ఒక వ్యక్తిగా తన స్థాయిని, స్థానాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మౌనీ రాయ్ స్పష్టం చేశారు. అయితే ఈ పోస్ట్ వైరల్ భయానీ లాంటి సోషల్ మీడియా పేజీల్లో ప్రత్యక్షం కావడంతో నెటిజన్ల నుండి భిన్నమైన స్పందనలు వచ్చాయి. కొందరు నెటిజన్లు మౌనీని తీవ్రంగా ట్రోలింగ్ చేస్తుండగా.. మరికొందరు తన ప్రైవసీ హక్కుకు మద్దతుగా నిలుస్తున్నారు. ట్రోలర్స్ మౌనీ రాయ్‌ను టార్గెట్ చేస్తూ.. సెలబ్రిటీలు సాధారణంగా తామే స్వయంగా పీఆర్ టీమ్స్ ద్వారా ఫోటోగ్రాఫర్లకు సమాచారం ఇచ్చి పిలిపించుకుంటారని.. ఇప్పుడు ఇలా డ్రామాలు ఆడడం విడ్డూరంగా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. ఏదో లైమ్‌లైట్ కోరికతోనో లేదా పబ్లిసిటీ స్టంట్ కోసమో ఇలా చేస్తోందని కొందరు... రెండు రోజులు మీడియా కవరేజ్ లేకపోతే సెలబ్రిటీలు తట్టుకోలేరంటూ మరికొందరు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు.



# జపాన్ ఓపెన్‌లో సింధు జోరు

## ప్రపంచ నంబర్-5కు షాక్!

### హాన్ యూయేపై సింధు 21-16, 21-14తో విజయం

భారత్ స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హాన్ యూయే (చైనా)పై వరుస గేమ్‌లలో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ విజయంతో టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచిన ఏకైక క్రీడాకారిణిగా నిలిచింది. ప్రారంభంలో ఇద్దరి మధ్య హోరాహోరీ పోటీ కనిపించింది. హాన్ యూయే మ్యాచ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేసినా సింధు క్రమంగా లయ అందుకుంది. కచ్చితమైన షాట్లు, దూకుడు ఆటతో ర్యాలీలపై ఆధిపత్యం చెలాయించింది. తొలి గేమ్‌ను 21-16తో సొంతం చేసుకుని మ్యాచ్‌లో పైచేయి సాధించింది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి 8-0 ఆధిక్యంలోకి వెళ్లింది. హాన్ యూయే కొంత పోరాడినా సింధు ఏమాత్రం తడబడలేదు. చివరకు 21-14తో రెండో గేమ్‌ను కూడా గెలిచి కేవలం 35 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. హాన్ యూయేపై సింధు హెడ్ టు హెడ్ రికార్డు 8-1కు చేరింది. ప్రపంచ పదో ర్యాంకర్‌గా ఉన్న సింధు క్వార్టర్ ఫైనల్లో జపాన్ మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమీ ఒకుహారాతో తలపడనుంది. ప్రపంచ నంబర్ వన్ అన్ సె యంగ్ రెండో రౌండ్ నుంచి వైదొలగడంతో ఒకుహారా క్వార్టర్‌కు చేరుకుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలా-తనీషా క్రాస్టో జోడీ ఓటమితో నిష్క్రమించగా, లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి, ఉన్నతి హూడా ఇప్పటికే తొలి రౌండ్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# స్వీయ నమ్మకమే కోహ్లి సీక్రెట్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అపారమైన విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం, తన ఆట పద్ధతులపై అతనికి ఉన్న అచంచలమైన నమ్మకమేనని భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ అన్నాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లి ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సమయంలో జరిగిన ఒక సంభాషణను గుర్తుచేసుకుంటూ, కోహ్లి మైండ్‌సెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ నాయర్ ఈ విషయాలను పంచుకున్నాడు. కొన్నేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లి వరుసగా రెండుసార్లు డకౌట్ అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పుడే తాను భారత జట్టు సహాయక కోచ్ పదవి నుంచి తప్పుకున్నానని, అయినా కోహ్లితో టచ్‌లో ఉన్నానని నాయర్ తెలిపాడు.



"ఆ సమయంలో నేను కోహ్లికి ఫోన్ చేసి, అంతా బాగానే ఉందా? ఏమైనా మాట్లాడాలనుకుంటున్నావా? అని అడిగాను. దానికి కోహ్లి చాలా ప్రశాంతంగా 'అంతా బాగానే ఉంది. ఇదంతా ఆటలో భాగమే' అని సమాధానమిచ్చాడు" అని నాయర్ చెప్పాడు. ఆ తర్వాత తాను ఒక టెక్నికల్ విషయాన్ని గమనించానని, దాని గురించి చెప్పాలనుకుంటున్నానని కోహ్లి అనుమతి కోరానని నాయర్ తెలిపాడు. "నేను 'ఒక విషయం గమనించాను. వింటావా?' అని అడిగాను. దానికి అతను నవ్వుతూ 'వద్దు, నేను నా పద్ధతిలోనే చేస్తాను' అని సున్నితంగా తిరస్కరించాడు. నాకు నవ్వొచ్చింది. ఆ తర్వాతి మ్యాచ్ అనంతరం నాకు అతడి నుంచి 'నేను నా పద్ధతిలోనే చేశాను' అనే సమాధానం వచ్చింది" అని నాయర్ ఆ సంభాషణను వివరించాడు. ఈ ఒక్క సంఘటన విరాట్ కోహ్లి ఎంతటి గొప్ప ఆటగాడో చెబుతుందని నాయర్ అభిప్రాయపడ్డాడు.





# ఇంగ్లండ్ గ్రాండ్ విక్టరీ

కార్డిఫ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో 4 వికెట్ల తేడాతో భారత్ ఓటమి పాలైంది. టీమిండియా నిర్దేశించిన 254 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చేధించింది. లక్ష్య చేధనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయినప్పటికి, సీనియర్ బ్యాటర్ జోరూట్(133 బంతుల్లో 99 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు.

రూట్ తన 21వ వన్డే సెంచరీకి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. గస్ అట్కిన్సన్ ఫోర్ బాది మ్యాచ్‌ను ముగించడంతో రూట్‌కు సెంచరీ చేసే అవకాశం లభించలేదు. అతడితో పాటు విల్ జాక్స్ 30 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ రెండు, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, శివమ్ దూబే, అక్షర్ పటేల్ తలా వికెట్ సాధించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమిండియా 44 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌట్ అయింది. ఓ దశలో 300 పరుగులు చేసేలా కనిపించిన భారత్.. మిడిలార్డర్ విఫలం కావడంతో నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. గిల్ సేన తన చివరి ఏడు వికెట్లను 55 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి(65), శ్రేయస్ అయ్యర్(66) అర్ధ శతకాలతో రాణించగా.. ఆఖరిలో జస్ప్రీత్ బుమ్రా(20) కాస్త దూకుడగా ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా అర్చర్ అట్కిన్సన్ తలా మూడు వికెట్లు పడగొట్టగా.. సాకిబ్ మహమూద్ 2, సామ్ కర్రన్, విల్ జాక్స్ ఒక్కో వికెట్ సాధించారు. ఈ విజయంతో ఇంగ్లీష్ జట్టు మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య సిరీస్ డిసైడర్ మూడో వన్డే ఆదివారం జరగనుంది.

# రొనాల్డో కంటే మెస్సీనే 'గ్రేటెస్ట్'

## : అర్జెంటీనా కోచ్

ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు ముందే ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక ఆసక్తికరమైన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. అర్జెంటీనా జట్టు ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోని.. తన జట్టు కెప్టెన్ లియోనల్ మెస్సీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఫుట్‌బాల్ చరిత్రలోనే మెస్సీ అత్యంత గొప్ప ఆటగాడని (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) ఆయన స్పష్టం చేశారు. సమకాలీన ఫుట్‌బాల్‌లో మెస్సీకి, క్రిస్టియానో రొనాల్డోకు మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న అత్యుత్తమ ఆటగాడి పోటీకి ఈ వ్యాఖ్యలతో ఆయన ఒక స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. ఒక అంతర్జాతీయ క్రీడా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోచ్ స్కలోని మాట్లాడుతూ.. క్రిస్టియానో రొనాల్డో కూడా అద్భుతమైన ఆటగాడేనని, అందులో ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నాడు. అయితే, వాటన్నింటికీ అతీతంగా మెస్సీ ఆటలో ఉన్న మేధస్సు, మైదానంలో అతడు సృష్టించే మ్యాజిక్ మరెవరికీ సాధ్యం కాదని కొనియాడాడు. గోల్స్ చేయడం మాత్రమే కాకుండా, జట్టును నడిపించే విధానంలోనూ, తోటి ఆటగాళ్లను ప్రోత్సహించడంలోనూ మెస్సీ శైలి ప్రత్యేకమైనదని, అందుకే అతడు చరిత్రలో అత్యుత్తమ ఆటగాడిగా నిలుస్తాడని వివరించారు. స్పెయిన్‌తో జరగబోయే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు ముందు కోచ్ చేసిన ఈ వ్యాఖ్యలు అర్జెంటీనా అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. మెస్సీ నాయకత్వంలోని అర్జెంటీనా జట్టు మరోసారి ప్రపంచ విజేతగా నిలిచేందుకు సర్వసన్నద్ధమైంది. టోర్నీలో మెస్సీ ఫామ్, కోచ్ స్కలోని వ్యూహాలు జట్టును విజయతీరాలకు చేరుస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఆదివారం న్యూయార్క్ వేదికగా జరిగే ఫైనల్ పోరులో మెస్సీ తన మేధస్సుతో అర్జెంటీనాకు మరో కప్పు అందిస్తాడో లేదో చూడాలి.



# ఫైనల్‌కు అర్జెంటీనా

## ఇంగ్లండ్‌పై సంచలన విజయం



ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరోసారి తన అసాధారణ ప్రతిభతో మ్యాజిక్ చేశాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో చివరి నిమిషాల్లో రెండు కీలక అసిస్ట్‌లు అందించి జట్టుకు 2-1 తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతేకాకుండా ఈ ప్రదర్శనతో మెస్సీ గోల్డెన్ బూట్ రేసులోనూ అగ్రస్థానానికి చేరుకున్నాడు. 39 ఏళ్ల మెస్సీ ఈ టోర్నమెంట్‌లో జట్టుకు అత్యంత అవసరమైన సమయంలో నాయకుడిగా తన విలువేంటో నిరూపించాడు. మ్యాచ్ ద్వితీయార్ధంలో ఆంటోనీ గోర్డాన్ గోల్ చేయడంతో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా ఓటమి అంచున నిలిచింది. అయితే, ఆట చివరి నిమిషాల్లో కెప్టెన్ మెస్సీ తన విశ్వరూపం చూపించాడు. 85వ నిమిషంలో అతను అందించిన పాస్‌ను ఎంజో ఫెర్నాండెజ్ అద్భుతమైన లాంగ్ రేంజ్ షాట్‌తో గోల్‌గా మలిచి స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత ఇంజ్యూరీ టైంలో మెస్సీ అందించిన క్రాస్‌ను లాటారో మార్టినెజ్ హెడర్‌తో గోల్ చేసి అర్జెంటీనాకు సంచలన విజయాన్ని ఖాయం చేశాడు.

### గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ టాప్

ఈ రెండు అసిస్ట్‌లతో మెస్సీ గోల్డెన్ బూట్ రేసులో ఫ్రాన్స్ స్టార్ కైలియన్ ఎంబాపెను అధిగమించాడు. ప్రస్తుతం మెస్సీ 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో అగ్రస్థానంలో ఉండగా, ఎంబాపె 8 గోల్స్, 3 అసిస్ట్‌లతో రెండో స్థానంలో ఉన్నాడు. నిబంధనల ప్రకారం ఇద్దరు ఆటగాళ్ల గోల్స్ సంఖ్య సమానంగా ఉన్నప్పుడు అసిస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని విజేతను నిర్ణయిస్తారు. సెమీఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడిపోయిన ఫ్రాన్స్ మూడో స్థానం కోసం ఇంగ్లండ్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో ఎంబాపె తన అసిస్ట్‌ల సంఖ్యను పెంచుకునే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం మెస్సీనే రేసులో ముందున్నాడు. ఈ టోర్నీలో అర్జెంటీనాను మెస్సీ ఒంటిచేత్తో నడిపిస్తున్న తీరుకు ఈ మ్యాచ్ మరో ఉదాహరణ. ఈజిప్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కూడా రెండు గోల్స్ వెనుకబడిన జట్టును.. ఒక గోల్, ఒక అసిస్ట్‌తో గెలిపించాడు. ఇప్పుడు ఆదివారం జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో అర్జెంటీనా తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడమే కాకుండా మెస్సీ తన కెరీర్‌లో తొలిసారిగా ప్రపంచకప్ గోల్డెన్ బూట్‌ను గెలుచుకునే అవకాశం ఉంది.




### కష్టపడే ఫైనల్‌కు చేరాం: మెస్సీ

వరల్డ్ కప్‌లో అర్జెంటీనాకు ఫిఫా అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ వస్తున్న ఆరోపణలపై ఆ జట్టు కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎట్టకేలకు స్పందించాడు. తమ విజయాల్లో ఎలాంటి పక్షపాతం లేదని స్పష్టం చేశాడు. కష్టపడి ఆడిన ఫలితంగానే ఈ స్థాయికి చేరుకున్నామన్నాడు. ఎవరూ తమకు అనుకూలంగా ఏదీ ఇవ్వలేదని, ప్రతి గోల్ వెనుక ఎంతో కష్టం ఉందని తేల్చిచెప్పాడు. సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై అర్జెంటీనా విజయం సాధించి వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. "మేం గత నాలుగేళ్లుగా అత్యుత్తమ జట్టుగా నిలిచాం. . వరుసగా రెండు ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరడం చాలా అరుదైన విషయం. మేం సాధించింది అదృష్టంతో కాదు. మా ఆటతోనే ఈ స్థాయికి వచ్చాం" అని మెస్సీ విమర్శకులకు గట్టిగా బదులిచ్చాడు.

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# హీట్ ఐలాండ్.. నగరాలు!

ఒకప్పుడు వేసవి అంటే గ్రామాల్లో చెట్ల నీడ, చెరువుల చల్లదనం గుర్తొచ్చేవి. ఇప్పుడు నగరాల్లో వేసవి అంటే మండే రోడ్లు, వేడెక్కిన భవనాలు, రాత్రిపూట కూడా తగ్గని ఉక్కపోత గుర్తుకొస్తున్నాయి. వర్షాలు లేకపోవడం ఒక సమస్య అయితే, నగరాల్లో సహజంగా ఉండాల్సిన ఉష్ణోగ్రత కంటే 3 నుంచి 8 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదవడం మరో పెద్ద ప్రమాదం. దీనినే శాస్త్రవేత్తలు "అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్"గా పేర్కొంటున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాల్లో గత కొన్నేళ్లుగా ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. నగర శివార్లతో పోలిస్తే నగర మధ్య ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో కూడా భూమి చల్లబడకపోవడం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికి ప్రధాన కారణం మన అభివృద్ధి నమూనానే. చెట్ల స్థానంలో కాంక్రీట్ భవనాలు, మట్టి స్థానంలో సిమెంట్ రోడ్లు, చెరువుల స్థానంలో నిర్మాణాలు, పార్కుల స్థానంలో వాణిజ్య సముదాయాలు నిర్మించడంతో నగరాలు సహజ శీతలీకరణ వ్యవస్థను కోల్పోతున్నాయి. పగటి సమయంలో కాంక్రీట్, తారు రోడ్లు సూర్యరశ్మిని గ్రహించి, రాత్రి వరకు వేడిని విడుదల చేస్తుంటాయి. ఫలితంగా నగరం మొత్తం ఒక భారీ హీట్ స్టోరేజ్‌గా మారుతోంది. హైదరాబాద్ పరిస్థితి దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. గత రెండు దశాబ్దాల్లో నగరం వేగంగా విస్తరించింది. ఐటీ, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగాయి. కానీ అదే వేగంతో పచ్చదనం పెరగలేదు. అనేక చెరువులు కనుమరుగయ్యాయి. వందల ఎకరాల ఖాళీ భూములు కాంక్రీట్ నిర్మాణాలుగా మారాయి. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు, ఫ్లైఓవర్లు, విస్తారమైన రోడ్లు అభివృద్ధికి చిహ్నాలే. కానీ వాటితో పాటు నగర ఉష్ణోగ్రత కూడా పెరిగిందనే వాస్తవాన్ని విస్మరించకూడదు. హీట్ ఐలాండ్ ప్రభావం కేవలం అసౌకర్యం కాదు. ఇది ప్రజారోగ్యానికి ముప్పు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు అత్యధికంగా ప్రభావితమవుతున్నారు. హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు పెరిగే ప్రమాదం ఉంటుంది. అంతేకాదు, వేడి పెరగడంతో ఎయిర్ కండిషనర్ల వినియోగం పెరిగి విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతోంది. ఇది మరోవైపు విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతోంది. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవలి సంవత్సరాల్లో యూరప్‌లోని స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, గ్రీస్ వంటి దేశాలు తీవ్ర ఉష్ణ తరంగాలను ఎదుర్కొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం, వాతావరణ మార్పులతో పాటు పట్టణ హీట్ ఐలాండ్ ప్రభావం కూడా నగరాల్లో ఉష్ణోగ్రతలను మరింత పెంచుతోంది. అందుకే ప్రపంచంలోని అనేక నగరాలు ఇప్పుడు "కూల్ సిటీస్" భావనపై దృష్టి సారిస్తున్నాయి. అయితే ఈ సమస్యకు పరిష్కారం అసాధ్యం కాదు. ప్రకృతి మనకు సమాధానం ఎప్పుడో చెప్పింది. చెట్లు, చెరువులు, పార్కులు, పచ్చని ప్రదేశాలే నగరాలకు సహజ ఎయిర్ కండిషనర్లు. ఒక పెద్ద వృక్షం తన చుట్టుపక్కల ఉష్ణోగ్రతను గణనీయంగా తగ్గించగలదు. చెరువులు సూక్ష్మ వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయి. పార్కులు గాలి ప్రసరణకు దోహదపడతాయి. గ్రీన్ కారిడార్లు నగర ఉష్ణోగ్రతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వాలు చేపట్టే హరిత కార్యక్రమాలు కేవలం మొక్కలు నాటడానికే పరిమితం కాకూడదు. నాటిన మొక్కలు పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలి. ప్రతి కొత్త లేఅవుట్, ప్రతి రోడ్డు విస్తరణ, ప్రతి నిర్మాణ ప్రాజెక్టులో కనీస గ్రీన్ కవర్‌ను చట్టబద్ధంగా నిర్ధారించాలి. చెరువులను ఆక్రమణల నుంచి కాపాడాలి. భవన నిర్మాణాల్లో తెల్లటి లేదా వేడిని తక్కువగా గ్రహించే పైకప్పులు, గ్రీన్ రూఫ్‌లు, వర్షపు నీటి సంరక్షణ, సహజ గాలి ప్రసరణ వంటి పర్యావరణహిత నమూనాలను ప్రోత్సహించాలి. స్థానిక సంస్థల పాత్ర కూడా కీలకం. నగర ప్రణాళికలో చెట్లను అడ్డంకిగా కాకుండా మౌలిక సదుపాయంగా చూడాలి. రోడ్లు వెడల్పు చేయడం ఎంత ముఖ్యమో, వాటి పక్కన నీడనిచ్చే వృక్షాలను కాపాడటం కూడా అంతే ముఖ్యం. అభివృద్ధి అంటే కాంక్రీట్ మాత్రమే కాదని, పచ్చదనం కూడా అభివృద్ధిలో భాగమేనని గుర్తించాలి.




**ప్రపంచాన్ని ఒకప్పుడు చమురు ప్రభావితం చేసింది. తర్వాత సెమీకండక్టర్లు వ్యూహాత్మక ఆయుధంగా మారాయి. ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) దేశాల భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా ఎదుగుతోంది. ఈ పోటీలో ఎవరి వద్ద ఎక్కువ డేటా, అధిక కంప్యూటింగ్ సామర్థ్యం, శక్తివంతమైన డేటా సెంటర్లు ఉంటాయో వారు భవిష్యత్తు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉంది. అందుకే అమెరికా, చైనా, యూరప్, మధ్యప్రాచ్య దేశాలు ఏఐ మౌలిక సదుపాయాలపై లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నాయి.**

భారత్ కూడా ఈ పోటీలో వెనుకబడకూడదనే లక్ష్యంతో డేటా సెంటర్ల నిర్మాణానికి ప్రోత్సాహం ఇస్తోంది. హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, నోయిడా వంటి నగరాలు ఇప్పటికే ప్రపంచ డేటా సెంటర్ మ్యాప్‌లో కీలక స్థానాన్ని సంపాదిస్తున్నాయి. ఈ అభివృద్ధి ఆశాజనకమే. పెట్టుబడులు వస్తాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. క్లౌడ్ సేవలు, ఫిన్‌టెక్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, రక్షణ, పరిశోధన రంగాలకు బలం చేకూరుతుంది. డిజిటల్ ఇండియా లక్ష్యాలకు ఇది కీలక మౌలిక సదుపాయం. ఏఐ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే డేటా సెంటర్లు తప్పనిసరి.

### ఈ డేటా సెంటర్ల అసలు ఖర్చు ఎంత?

డేటా సెంటర్లు భవనాలు మాత్రమే కావు. అవి 24 గంటలూ పనిచేసే వేలాది సర్వర్ల సమాహారం. వీటిని నడపడానికి నిరంతర విద్యుత్ అవసరం. సర్వర్లను చల్లబరచడానికి శక్తి, అనేక సందర్భాల్లో నీటి వినియోగం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఏఐ మోడళ్ల అభివృద్ధితో ఈ అవసరం మరింత పెరుగుతోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వ్యవస్థలపై డేటా సెంటర్ల ప్రభావం గురించి చర్చ జరుగుతోంది. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో కొత్త డేటా సెంటర్లపై స్థానిక ప్రజలు, పర్యావరణ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వారి ప్రధాన అభ్యంతరం ఏఐ కాదు; ఏఐ మౌలిక సదుపాయాల భారం. భారీ విద్యుత్ వినియోగం వల్ల గృహ వినియోగదారులపై ఒత్తిడి పెరగవచ్చని, నీటి వనరులపై అదనపు భారం పడవచ్చని, స్థానిక విద్యుత్ గ్రిడ్‌పై ప్రభావం ఉండవచ్చని వారు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులపై కఠిన షరతులు విధించడం, అనుమతులను పునఃసమీక్షించడం వంటి చర్యలు కూడా కనిపిస్తున్నాయి. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అమెరికా మొత్తంగా "మాకు డేటా సెంటర్లు వద్దు" అనే విధానాన్ని అవలంబించలేదు. అక్కడ కూడా ఏఐ, క్లౌడ్ రంగాల్లో భారీ పెట్టుబడులు కొనసాగుతున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలు, స్థానిక సమాజాలు పర్యావరణ ప్రభావం, విద్యుత్, నీటి వినియోగంపై మరింత కఠినమైన ప్రమాణాలను కోరుతున్నాయి. అంటే అభివృద్ధిని తిరస్కరించడం కాదు; బాధ్యతాయుత అభివృద్ధిని డిమాండ్ చేస్తున్నాయి.

### భారత్‌కు పాఠం

మన దేశంలో విద్యుత్ డిమాండ్ ఇప్పటికే ప్రతి ఏడాది కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. ఎయిర్ కండిషనర్ల వినియోగం, పారిశ్రామికీకరణ, ఎలక్ట్రిక్ వాహనాలు, పట్టణీకరణతో విద్యుత్ అవసరం వేగంగా పెరుగుతోంది. మరోవైపు అనేక రాష్ట్రాలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో డేటా సెంటర్లకు అనుమతులు ఇస్తున్నప్పుడు కేవలం పెట్టుబడుల పరిమాణం మాత్రమే కాకుండా, వాటి శక్తి సామర్థ్యం, నీటి వినియోగం, కార్బన్ ఉద్గారాలు, స్థానిక ప్రజలపై ప్రభావం వంటి అంశాలను కూడా పరిశీలించాలి. ప్రత్యేకించి హైదరాబాద్ వంటి నగరాల్లో ఇప్పటికే తాగునీటి అవసరాలు, భూగర్భ జలాల తగ్గుదల, పట్టణ ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలు ఉన్నాయి. ఇక్కడ కొత్త డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలంటే వాటికి ప్రత్యేకంగా పునరుత్పాదక ఇంధన వనరులు, శుద్ధి చేసిన మురుగునీటి వినియోగం, అధునాతన శీతలీకరణ సాంకేతికత వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలి. భారత్ ఏఐలో ప్రపంచ నాయకత్వం సాధించాలంటే డేటా సెంటర్లు అవసరమే. కానీ అవి ప్రజల విద్యుత్, నీటి అవసరాలతో పోటీ పడకూడదు. రైతుకు విద్యుత్ కోతలు విధించి, నగర ప్రజలకు నీటి పరిమితులు అమలు చేస్తూ, అదే సమయంలో అధిక వనరులు వినియోగించే మౌలిక సదుపాయాలను నియంత్రణ లేకుండా విస్తరించడం సమతుల్య అభివృద్ధి కాదు. ఇప్పుడు ప్రభుత్వాలు "గ్రీన్ డేటా సెంటర్" విధానంపై దృష్టి పెట్టాలి. సౌర, పవన విద్యుత్‌తో నడిచే డేటా సెంటర్లు, తక్కువ నీటితో పనిచేసే శీతలీకరణ పద్ధతులు, శక్తి సామర్థ్య ప్రమాణాలు, కార్బన్ ఉద్గారాల లక్ష్యాలు, స్థానిక మౌలిక సదుపాయాల సామర్థ్యానికి అనుగుణంగా అనుమతులు.. ఇవన్నీ భవిష్యత్తు విధానాల్లో భాగం కావాలి.

ఏఐ పోటీని భారత్ విస్మరించే పరిస్థితి లేదు. ఈ రంగంలో ముందుండటం దేశ ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు అవసరం. కానీ అభివృద్ధి అనేది కేవలం పెట్టుబడుల సంఖ్యతో కొలవబడదు. ఆ అభివృద్ధి ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందనే దానితో కొలవాలి. ఏఐ కోసం ప్రపంచ పోటీలో భారత్ తప్పక ముందుండాలి. కానీ ఆ ప్రయాణంలో విద్యుత్ భద్రతను, నీటి వనరులను, పర్యావరణాన్ని, ప్రజల హక్కులను పణంగా పెట్టకూడదు. డేటా సెంటర్లు దేశ డిజిటల్ భవిష్యత్తుకు పునాది కావచ్చు. కానీ ఆ పునాది సుస్థిరత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజా ప్రయోజనాలపై నిర్మితమైతేనే అది నిజమైన ప్రగతి అవుతుంది. ఏఐ యుగంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహించాలంటే, సాంకేతికతలోనే కాదు.. బాధ్యతాయుత అభివృద్ధిలోనూ ఆదర్శంగా నిలవాలి.



వినోద్ కుమార్ సీనియర్ ఐటీ ఇంజినీర్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.